ప్రజావాణికి ఫిర్యాదుల వెల్లువ

కూకట్‌పల్లి, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): మూసాపేటలోని జీహెచ్ఎంసీ జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. కూకట్‌పల్లి జోనల్ కార్యాలయ పరిధిలోని ఐదు సర్కిళ్ల నుంచి 40ఫిర్యాదులు అందాయి. మూసాపేట సర్కిల్ నుంచి 7, కూకట్‌పల్లి నుంచి 2, కుత్బుల్లాపూర్ 8, గాజులరామారం 7, అల్వాల్ 1, జోనల్ కార్యాలయానికి సంబంధించినవి 15చొప్పున ఫిర్యాదులు వచ్చాయి. రోడ్లు, టౌన్ ప్లానింగ్, పారిశుధ్యం, పార్కులకు సంబంధించిన దరఖాస్తులు ఎక్కువగా వచ్చాయి. జోనల్ కార్యాలయానికి సంబంధించిన ఫిర్యాదుదారులతో జెడ్సీ అభిలాష అభినవ్ మాట్లాడి సమస్యలు తెలుసుకొన్నారు. ఆయా సమస్యలను పరిష్కరించి నివేదికను అందజేయాలని అధికారులను జెడ్సీ ఆదేశించారు. కార్యక్రమంలో జోనల్, మూసాపేట, కూకట్‌పల్లి సర్కిళ్ల అన్ని విభాగాల అధికారులు పాల్గొన్నారు.



ఫిర్యాదులు అందుకుంటున్న డీసీ మల్లయ్య, పాల్గొన్న అధికారులు

● **కుత్బుల్లాపూర్:** కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్ల కార్యాలయాల్లో సోమవారం వేర్వేరుగా ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలో మొత్తం 8 ఫిర్యాదులు అందగా వాటిలో ఇంజనీరింగ్, రెవెన్యూ విభాగానికి 5, పట్టణ ప్రణాళిక, రెవెన్యూ, విద్యుత్ విభాగాలకు ఒక్కొక్క ఫిర్యాదు చొప్పున అందాయి. గాజులరామారం సర్కిల్‌కు గాను మొత్తం 7 ఫిర్యాదులు అందగా వాటిలో ఇంజనీరింగ్ విభాగానికి 3, యూబీడీ, పట్టణ ప్రణాళిక, రెవెన్యూ విద్యుత్ విభాగాలకు ఒక్కొక్క ఫిర్యాదు చొప్పున అందాయి. ఈ కార్యక్రమాల్లో జంట సర్కిళ్ల ఉప కమిషనర్లు నర్సింహా, ఎల్‌పీ. మల్లయ్య, ఏఎంసీలు ఉదయ్‌కుమార్, నర్సింగ్‌రావు, డీసీపీలు సాయిబాబా, సంతోష్‌కుమార్, ఏఎంవోహెచ్ భార్గవ నారాయణ, చంద్రశేఖర్‌రెడ్డి, ఇంజనీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

'ప్రభుత్వ భూములు, చెరువులను కాపాడాలి'

● **దుండిగల్:** నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలోని కబ్జాకు గురవుతున్న ప్రభుత్వ భూములు,పార్కులు, చెరువుల ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు సతీష్ ఆధ్వర్యంలో మేడ్చెల్ జిల్లా కలెక్టర్‌కు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. చింతల, కుడి, నార్లకుంట, వీఏన్ఆర్‌పార్కు స్థలాలు కబ్జాఅవుతున్నా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోకుండా నిమ్మకు నీరెత్తినట్టుగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. తక్షణమే చర్యలు తీసుకుని ప్రభుత్వ స్థలాలను పరిరక్షించాలని కోరారు.

● **గచ్చిబౌలి:** శేరిలింగంపల్లి మండలంలోని అన్యాక్రాంతం అవుతున్న చెరువులు, కుంటలను కాపాడాలని మదర్ సేవా సమితి చైర్మన్ బద్దం కొండల్‌రెడ్డి కోరారు. సోమవారం ఆయన ప్రజావాణి కార్యక్రమంలో శేరిలింగంపల్లి తహసీల్దార్‌కు, జోనల్ కమిషనర్‌కు వేర్వేరుగా వినతి పత్రాలు ఇచ్చారు. అలాగే దుర్గం చెరువు, హఫీజ్‌పేట ఈర్లచెరువు, నాయనమ్మకుంట, రామసముద్రం కుంట ఇలా చాలా చెరువులను కబ్జాదారుల నుంచి కాపాడాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. గతంలో పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన లేదని, ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని కోరారు.

నకిలీ ఐడీలు సృష్టించి అమాయకులకు బురిడీ

● యువతి పేరిట చాటింగ్ చేసి యువకుడికి రూ. లక్ష టోకరా

● నిందితుడిని అరెస్టు చేసిన సైబరాబాద్ సైబర్‌క్రైం పోలీసులు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): సోషల్‌మీడియాలో ప్రముఖుల పేరిట నకిలీ ఐడీలు సృష్టించి... మాయమాటలతో డబ్బులు కాజేస్తున్న నిందితుడినిసైబరాబాద్ సైబర్‌క్రైం పోలీసులు అరెస్టు చేశారు. విశాఖపట్నానికి చెందిన తమ్మారెడ్డి శశాంక్‌రెడ్డి(24) జూనియర్ ఆర్టిస్టుగా పని చేస్తూ రంగారెడ్డి జిల్లాలో నివాసముంటున్నాడు. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్‌లలో నకిలీ ప్రొఫైల్స్, ఐడీలు సృష్టించి... ప్రముఖుల ఫోటోలు, వారి వివరాలు సేకరించి వాటితో నకిలీ ప్రొఫైల్స్ సృష్టించి అమాయకులను బురిడీ కొట్టిస్తుంటాడు. ఒకవేళ యువతులు తారసపడితే వారితో చాటింగ్ చేసినట్లు నటిస్తూ... మాయమాటలు చెబుతూ... అర్జెంట్‌గా డబ్బులు అవసరమని మభ్యపెట్టి డబ్బులు తెప్పించుకుంటాడు. పురుషులు తారసపడితే యువతుల ప్రొఫైల్‌తో బురిడీ కొట్టిస్తుంటాడు. ఇదే తరహాలో నగరానికి చెందిన యువకుడు మోసపోయి సైబర్‌క్రైం పోలీసులను ఆశ్రయించాడు. మేఘనా రఘుపాత్రుని పేరిట ఐడీ సృష్టించి... సోషల్‌మీడియాలో భారీ ఫ్యాన్ ఫాలోయింగ్ తనకే ఉందని యువకునితో సంభాషణ ప్రారంభించాడు తనకెంతో ఫ్యాన్ ఫాలోయింగ్ ఉందని నమ్మించి.. ఆ తర్వాత అతనితోనే పెళ్లి చేసుకుంటానని కూడా చెప్పి బాధితున్ని బుట్టలోకి దించాడు. ఆ తర్వాత సడెన్‌గా గత డిసెంబర్ 26న తల్లి చనిపోయిందని.. అర్జెంట్‌గా రూ. 3వేలు అవసరమని అడిగాడు. ఆ తర్వాత ఆస్పత్రులు, ఇంటి అద్దె, ఇతర ఖర్చుల పేరిట తరచూ డబ్బులు అడగసాగాడు. అతన్ని నమ్మిన యువకుడు అతను అడిగినప్పుడల్లా డబ్బులు పంపించాడు. మొత్తం రూ.1.05లక్షలు సమర్పించుకున్నాడు. ఆ తర్వాత... ఫోన్ చేస్తే మాట్లాడకుండా చాటింగ్‌లకే పరిమితం కావడం... కలుద్దామంటే కలవకుండా తప్పించుకోవడంతో బాధితునికి అనుమానం వచ్చింది. తన డబ్బులు తనకు తిరిగి ఇచ్చేయాలని అడగసాగాడు. అనుమానంతో పోలీసులను ఆశ్రయించగా నిందితున్ని పోలీసులు అరెస్టు చేశారు. విచారించగా.. ఎంతోమందిని మోసం చేసినట్లు వెల్లడించాడు. పలువురిని మోసం చేసిన నిందితుడిపై చైతన్యపురిలో పోక్సో కేసు, సైబరాబాద్‌లో సైబర్ క్రైం కేసులు నమోదయ్యాయి. నిందితున్ని అరెస్టు చేసి అతడి నుంచి వన్‌ప్లస్ మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నారు.

యూ ట్యూబ్ వీడియోలతో ప్రభావితం చేసి..

● రియల్ ఎస్టేట్‌లో పెట్టుబడులు పెట్టించి రూ. కోట్లు కొల్లగొట్టిన ఘనుడు..

● నిందితుడిని అదుపులోకి తీసుకున్న సీసీఎస్ పోలీసులు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): రియల్ ఎస్టేట్ వ్యాపారంలో పెట్టుబడులు పెడితే.. అతి తక్కువ సమయంలోనే రూ. కోట్లు సంపాదించొచ్చు అంటూ.. యూ ట్యూబ్‌లో వీడియోలు చేస్తూ.. వందలమందిని ప్రభావితం చేసి రూ. కోట్లు కొల్లగొట్టిన మోసగాడిని సీసీఎస్ పోలీసులు అరెస్టు చేశారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. శివకుమార్ అనే వ్యక్తి ఓ యూ ట్యూబ్ చానల్ నిర్వహిస్తూ.. రియల్ ఎస్టేట్ పెట్టుబడులు, లాభాల గురించి వీడియోలు చేసి పోస్టుచేస్తూ వందల సంఖ్యలో ఫాలోవర్స్‌ను సంపాదించుకున్నాడు. ఎక్కడ పెట్టుబడులు పెడితే అధిక లాభాలు వస్తాయనే విషయాలు విశదీకరిస్తూ ఆకట్టుకునేవాడు. ఆ వీడియోలు చూసిన చాలా మంది అతడి మాటలకు ప్రభావితులై నేరుగా సంప్రదించి రూ. కోట్లలో పెట్టుబడి పెట్టారు. ఇదే మంచి అవకాశంగా భావించిన శివకుమార్ పెట్టుబడులు పెట్టడానికి వచ్చిన వారి నుంచి కోట్లాది రూపాయలు కొల్లగొట్టి రిటర్న్స్ ఇవ్వకుండా ఉడాయించాడు. విషయం తెలుసుకున్న బాధితులు సీసీఎస్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు నిందితుడిని గుర్తించి మూడు రోజుల క్రితం అదుపులోకి తీసుకున్నారు. అతడిని విచారించిన క్రమంలో.. అతడి మాయలో పడి పదుల సంఖ్యలో బాధితులు మోసపోయి రూ. కోట్లలో సమర్పించుకున్నట్లు తెలిసింది. కొల్లగొట్టిన డబ్బు నిందితుడు ఏం చేశాడు..? ఎక్కడ పెట్టాడు..? అనే విషయమై సీసీఎస్ పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు.

నగరానికి రుత్విక్ రాజన్ మృతదేహం

తిరుమలగిరి ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ఎంఎస్ పూర్తి చేసేందుకు అమెరికా వెళ్లి బ్రెయిన్ స్ట్రోక్‌తో వారం రోజుల క్రితం మృతి చెందిన ఓ యువకుడి మృతదేహం సోమవారం నగరానికి చేరుకుంది. సికింద్రాబాద్‌లోని తిరుమలగిరికి చెందిన తులసీరాజన్- మాధవిల కుమారుడు రుత్విక్ రాజన్(30) రెండేళ్ల క్రితం అమెరికాలో ఎంఎస్ చేసేందుకు వెళ్లాడు. టెక్సాస్ యూనివర్సిటీ లో ఎంఎస్ పూర్తి చేసి ఉద్యోగ వేటలో ఉంటూ స్నేహితులతో కలిసి డెన్వర్‌లో ఉంటున్నాడు. గత సోమవారం స్నేహితులతో కలిసి ఓ హోటల్‌లో భోజనం చేస్తుండగా అకస్మాత్తుగా కుప్పకూలడంతో అతన్ని ఆస్పత్రికి తరలించారు. బ్రెయిన్‌లో బ్లడ్ క్లాట్ అయిన నేపథ్యంలో వైద్యులు శస్త్ర చికిత్స చేసి 12గంటలపాటు అబ్జరవేషన్‌లో ఉంచారు. అయితే, 8గంటలు గడిచేలోపే రుత్విక్ రాజన్ మృతిచెందినట్లు వైద్యులు వెల్లడించారు. రుత్విక్ మృతదేహం సోమవారం తిరుమలగిరిలోని ఇంటికి చేరడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. రుత్విక్ మృతదేహానికి ఎల్‌బీనగర్ డీసీపీ మురళీ, పలువురు స్థానికులు నివాళులు అర్పించి కన్నీటి వీడ్కోలు పలికారు. తిరుమలగిరిలోని స్వర్గవాటికలో అంత్యక్రియలు జరిగాయి.

ఆలిండియా పోలీస్ మీట్‌లో..

సైబరాబాద్‌కు మూడు పతకాలు

● రెండు గోల్డ్.. ఓ సిల్వర్ మెడల్



పతకాలను సాధించిన పోలీసులను అభినందిస్తున్న కమిషనర్ అవినాష్ మహంతి

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): ఉత్తర ప్రదేశ్ లోని లక్నోలో జరిగిన 67వ ఆలిండియా పోలీస్ డ్యూటీ మీట్‌లో సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ సిబ్బందికి మూడు పతకాలు లభించాయి. పోలీస్ ఫొటోగ్రఫీలో సిటీ ఆర్మ్‌డ్ రిజర్వ్ హెడ్‌క్వార్టర్స్‌కు చెందిన ఎం.దేవేంద్ర ప్రసాద్‌కు గోల్డ్ మెడల్ లభించింది. గ్రౌండ్ సెర్చ్‌లో భాగంగా బాంబు డిస్పోజబుల్ టీమ్‌కు చెందిన జి.రామకృష్ణా రెడ్డి గోల్డ్ మెడల్ సాధించారు. మాదాపూర్ పోలీస్ స్టేషన్‌కు చెందిన ఎస్ఐ ఎస్‌వి.రమణ ఫొటోగ్రఫీ విభాగంలో సిల్వర్ మెడల్ సాధించారు. విజేతలను సోమవారం సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాశ్ మహంతి అభినందించారు.



కేరళ రాష్ట్రానికి చెందిన 58 మంది మునిసిపల్ మేయర్లు, మునిసిపల్ చైర్మన్లతో కూడిన బృందం సోమవారం జీహెచ్ఎంసీని సందర్శించింది. సమగ్ర వ్యర్థాల నిర్వహణ, క్లీన్ అండ్ గ్రీన్ సిటీగా తీర్చిదిద్దేందుకు అవలంబిస్తోన్న మెరుగైన విధానాలను మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, కమిషనర్ రోనాల్డ్‌రోస్ వారికి వివరించారు. - హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి)

వైభవంగా మల్లికార్జున స్వామి కల్యాణం

షాపూర్‌నగర్, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): రాజీవ్‌గాంధీనగర్, మెట్టుకానీగూడలోని మల్లికార్జునస్వామి జాతర సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర నాయకుడు శ్రీశైలంగౌడ్, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సొంటిరెడ్డి పున్నారెడ్డి, కార్పొరేటర్ రావుల శేషగిరి, పీఏసీఎస్ డైరెక్టర్ పరుష శ్రీనివాస్‌యాదవ్ పాల్గొన్నారు.

రూ. 42 లక్షలతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధునీకరణ



ఆరోగ్యకేంద్రం అదనపు భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ నాగేందర్‌యాదవ్

గచ్చిబౌలి, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లిలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధునీకరణకు రహేజా గ్రూప్ తోడ్పాడుతో రూ. 42 లక్షలతో అదనపు భవనం ఆధునీకరించారు. సోమవారం ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ ఎంపీ రంజిత్‌రెడ్డి చొరవతో రహేజా గ్రూపు ముందుకొచ్చి ఆస్పత్రికి ఆధునీకరణకు నిధులు కేటాయించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు మోహన్‌గౌడ్, వీరేశం గౌడ్, రాజేశ్వరమ్మ, డివిజన్ అధ్యక్షుడు మారబోయిన రాజుయాదవ్, నాయకులు రవీందర్‌గౌడ్, రాంబాబు, జనార్దన్‌రెడ్డి, పద్మారావు, శ్రీనివాస్‌రాజ్ ముదిరాజ్, రాంచందర్, శ్రీనివాస్‌యాదవ్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

అసోసియేషన్ సభ్యులకు సన్మానం

మియాపూర్, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): హఫీజ్‌పేట డివిజన్ జనప్రియనగర్ ఫేజ్-1 రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌కు నూతనంగా ఎన్నికైన సభ్యులు సోమవారం ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన అసోసియేషన్ సభ్యులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు దాత్రినాథ్‌గౌడ్, అసోసియేషన్ అధ్యక్షుడు జయసూరి, ఉపాధ్యక్షుడు మల్లికార్జున్, మల్లేశ్, జనరల్ సెక్రటరీ శ్రీనివాసరావు, జాయింట్ సెక్రటరీ సురేష్, మార్తమ్మ, ట్రెజరర్ శ్రీనివాస్, కల్చరల్ సెక్రటరీ ప్రభ, ఈసీ మెంబర్లు సత్యనారాయణ, జగన్మోహన్‌రెడ్డి, వాసుదేవ్, బ్రహ్మయ్య, సాంబశివరావు, గణేశ్, రమేష్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

సైబర్ భద్రతపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులతో హర్షిత

షాపూర్‌నగర్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): సైబర్ భద్రతపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం సోమవారం ఎడ్యూసిస్ట్స్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించా రు. ఈ కార్యక్రమం సంజయ్‌గాంధీనగర్, షాపూర్‌నగర్‌లోని సాయిలత మోడల్ హైస్కూల్‌లో నిర్వహించారు. ఎడ్యూసిస్ట్స్ కో ఫౌండర్ హర్షిత విద్యార్థులకు సైబర్ భద్రతపై ఫేస్ బుక్, ఇన్‌స్టాగ్రామ్, ఆన్‌లైన్ ఆటలు, వాట్సాప్, స్టేటస్‌లను ఎలా వాడాలో ఉదాహరణలతో అర్థమయ్యేలా వివరించారు. ఆన్‌లైన్ ఆటలు ఆడేటప్పుడు వారిచ్చే నియమ నిబంధనలు జాగ్రత్తగా చదవాలని, తల్లిదండ్రుల ఫోన్‌లో ఆన్‌లైన్ ఆటలు ఆడుతూ, గూగుల్ పే, ఫోన్ పే, పిన్ సంఖ్యను ఉపయోగించి, డబ్బులు బందీ చేయడం ద్వారా, డబ్బులు ఎలా నష్టపోతామో తెలిపారు. సైబర్ భద్రత హెల్ప్‌లైన్ నంబర్ 1930పట్ల పిల్లలకు అవగాహణ కల్పించారు. కార్యక్రమంలో జీడిమెట్ల పోలీస్ స్టేషన్ ఏఎస్ఐ వెంకట్రామ్‌రెడ్డి, సామాజిక వేత్త మధుబాబు చికిలే, పాఠశాల కరస్పాండెంట్ దయాకర్, పోలీస్ సిబ్బంది, పాఠశాల సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్కిలో యువత ఉపాధి శిక్షణ కేంద్రం ప్రారంభం



కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్ ఇండియా ప్రెసిడెంట్ డాక్టర్ రంగనాథ్

రాయదుర్గం, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి కౌశల్ వికాస యోజన ద్వారా గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కళాశాల(ఎస్కి)లో యువత ఉపాధి శిక్షణ కార్యక్రమాల నిర్వహణ, సమాచార కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాన్ని సోమవారం ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్ ఇండియా ప్రెసిడెంట్ డాక్టర్ జి.రంగనాథ్, సీనియర్ అధికారులు ప్రారంభించారు. కార్యక్రమంలో ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ నూతన కుమార్, ఎంశైహం ప్రసాద్‌రెడ్డి, ఎం.నాగరాజ్, సభ్యులు పాల్గొన్నారు.

ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీల్లో జేఎన్‌టీయూ తనిఖీలు వాయిదా

● తాజా షెడ్యూల్ ప్రకటనతో గందరగోళంలో ప్రొఫెసర్లు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ అఫిలియేషన్ కోసం దరఖాస్తు చేసుకున్న ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలల్లో నేటి నుంచి జరగాల్సిన ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీ(ఎఫ్ఎఫ్‌సీ) తనిఖీలు వాయిదా పడ్డాయి. గతేడాది ఏప్రిల్‌లో తనిఖీలు నిర్వహించిన జేఎన్‌టీయూ అధికారులు ఈ ఏడాది రెండు నెలల ముందుగానే షెడ్యూలు ప్రకటించడంపై పలు కళాశాలల నుంచి అభ్యంతరాలు వ్యక్తమైన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో దరఖాస్తు ప్రక్రియను పలుమార్లు సవరించిన ఉన్నతాధికారులు, తాజాగా తనిఖీల షెడ్యూలును కూడా వాయిదా వేశారు. ఈ నెల 27నుంచి (మంగళవారం) ఎఫ్ఎఫ్‌సీ తనిఖీలకు వెళ్లాల్సి ఉన్నందున యూనివర్సిటీ అనుబంధ కళాశాలల్లో పనిచేస్తున్న ప్రొఫెసర్లంతా అందుబాట్లో ఉండాలని ఇటీవల యాజమాన్యం ఆదేశించింది. సోమవారం సాయంత్రం వరకు తనిఖీల విషయమై యూనివర్సిటీ అధికారుల నుంచి ఎటువంటి సమాచారం లేకపోవడంతో.. తనిఖీలు ఉన్నాయో, లేవో తెలియక ప్రొఫెసర్లు గందరగోళానికి గురవుతున్నారు. ఈ విషయమై వర్సిటీ రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావును 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా, ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల్లో ఎఫ్ఎఫ్‌సీ తనిఖీలు మంగళవారం నుంచి ఉండే అవకాశం లేదన్నారు. తనిఖీలకు సంబంధించి ఆయా కళాశాలల యాజమాన్యాలకు, తనిఖీల నిమిత్తం యూనివర్సిటీ నుంచి వెళ్లే ప్రొఫెసర్లకు 24గంటల ముందుగానే సమాచారం అందిస్తామన్నారు.

కార్పొరేటర్ పాదయాత్ర

హైదర్‌నగర్, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): ఆల్విన్‌కాలనీ డివిజన్ వాంబే కాలనీలో కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ పర్యటించి డ్రైనేజీ సమస్యను పరిశీలించి త్వరలో పరిష్కరిస్తామని కాలనీవాసులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డివిజన్ మాజీ అధ్యక్షుడు పాండుగౌడ్, వెంకటేష్, వేణు గోపాల్, నరసింహ, వేణు, శ్రీకాంత్, ముస్తఫా, రమణ తదితరులు పాల్గొన్నారు.

నర్సింగ్ విద్యార్థులకు నిబంధనలు సరళతరం

● పశ్చిమ ఆస్ట్రేలియా ఆరోగ్యశాఖ మంత్రి అంబర్ జడే సాండర్సన్



మాట్లాడుతున్న పశ్చిమ ఆస్ట్రేలియా మంత్రి అంబర్ జడే సాండర్సన్

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ఆస్ట్రేలియాలో హెల్త్‌కేర్ ప్రొఫెషనల్‌గా నమోదు చేసుకోవడం, ఉపాధి పొందడం అంత సులభం కాదని, అయితే భారత్, తెలంగాణ ప్రభుత్వ చొరవతో కఠినతరంగా ఉన్న నిబంధనలను ఆస్ట్రేలియా సరళతరం చేయనున్నట్లు పశ్చిమ ఆస్ట్రేలియా ఆరోగ్యశాఖ మంత్రి అంబర్ జడే సాండర్సన్ తెలిపారు. తన భారత పర్యటనలో భాగంగా సోమవారం నిమ్స్‌లో జరిగిన ఆరోగ్య శిక్షణ శిబిరంలో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. భారత్ నర్సింగ్ విద్యార్థులు తమ ఉన్నత విద్య స్పెషలైజేషన్ కోసం ఆస్ట్రేలియాలో ప్రత్యేక నర్సింగ్ విశ్వ విద్యాలయాల్లో చేరవచ్చని తెలిపారు. భారత్‌తో పరస్పర అవగాహన, విజ్ఞానం, అనుభావాలు ఒకరికొకరం పంచుకోవడంలో పశ్చి మ ఆస్ట్రేలియా సిద్ధమని తెలిపారు. ఆస్ట్రేలియాలో వైద్యులు, నర్సింగ్, వైద్య అనుబంధ సాంకేతిక నిపుణులకు విస్తారమైన అవకాశాలు ఉన్నాయన్నారు. ఈసిం పోజియంలో మొదట నిమ్స్ సంచాలకులు డాక్టర్ నగరి బీరప్ప సంస్థలో ఉన్న వివిధ విభాగాలు, అందజేస్తున్న వివిధ కోర్సులు, సాధించిన విజయా లు, సాంకేతిక వ్యవస్థ, వైద్య ఆచార్యులు, ఇతర నర్సింగ్, పారామెడికల్ సిబ్బంది, భవిష్యత్ ప్రణాళికల గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. డీన్ డాక్టర్ లిజా రాజశేఖర్ స్వాగతోపన్యాసం చేశారు. కార్యక్రమంలో ఆస్ట్రేలియా ప్రభుత్వ ప్రతినిధులు స్టేసీ హేర్స్, జోడీ సౌత్, పార్లమెంట్ సెక్రెటరీ డాక్టర్ జగదీష్ కృష్ణన్, మేనేజింగ్ డైరెక్టర్ రామచంద్రన్, విద్యార్థులు పాల్గొన్నారు.

డయాలసిస్ సేవల పరిశీలన..

ఆస్ట్రేలియా ఆరోగ్యశాఖ మంత్రి గౌరవ అంబర్ జడే సాండర్సన్ నిమ్స్ డయాలసిస్ విభాగాన్ని సందర్శించి రోగులకు అందుతున్న సేవలను పరిశీలించారు. రాష్ట్రంలో వందకు పైగా డయాలసిస్ కేంద్రాలను ప్రభుత్వ మెడికల్ కళాశాలలకు అనుబంధంగా చేసి నిమ్స్ ప్రధాన కేంద్రంగా రోగులకు సేవలు అందిస్తు న్న తీరుని డాక్టర్ గంగాధర్ వివరించారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

చందానగర్, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): చందానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. విధి నిర్వహణలో ఉన్న పెట్రోలింగ్ సిబ్బంది లింగంపల్లి తారానగర్ బ్రిడ్జి వైపు వెళ్లగా ఓ వ్యక్తి నిద్రించి ఉన్నట్లు కనిపించడంతో లేపే ప్రయత్నం చేసినా స్పందించక పోవడంతో మృతి చెందినట్లు పోలీసులు గుర్తించారు. అతను భిక్షాటన చేస్తూ జీవిస్తుంటాడని, తినేందుకు తిండి దొరకకపోవడంతో మృతిచెంది ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్త ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మనూలో దివ్యాంగుల క్రికెట్ పోటీ



క్రికెట్ పోటీల్లో దివ్యాంగ విద్యార్థులు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): ఇంటర్ హాస్టల్ స్పోర్ట్స్‌మీట్‌లో భాగంగా గచ్చిబౌలిలోని మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీలో దివ్యాంగ విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించినట్లు వీసీ ప్రొఫెసర్ ఐనుల్ హసన్ సోమవారం తెలిపారు. పరుగుల పోటీలు, క్రికెట్‌తోపాటు ఇండోర్ గేమ్స్ నిర్వహించారు. ఈ స్పోర్ట్స్‌మీట్‌లో పాల్గొన్న దివ్యాంగ విద్యార్థులను రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఇస్తాక్ అహ్మద్ అభినందించారు. కార్యక్రమంలో డాక్టర్ ఎండీ యూసఫ్ ఖాన్, డాక్టర్ సమీనా బాసు తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థికి చేయూత



విద్యార్థికి ఆర్థికసాయం అందజేస్తున్న కొండా విజయ్

చందానగర్, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి తారానగర్‌కు చెందిన కృష్ణజోషి ప్రైవేటు కళాశాలలో ఇంటర్‌ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. కళాశాల ఫీజు చెల్లించక పోవడంతో హాల్‌టికెట్ ఇవ్వలేదు. దీంతో కుటుంబ సభ్యులు హోప్ ఫౌండేషన్ అధ్యక్షుడు కొండా విజయ్‌ను కలిసి విషయం చెప్పారు. స్పందించిన ఆయన రూ. 20వేల ఆర్థికసాయాన్ని విద్యార్థికి సోమవారం అందజేశారు. ఈసందర్భంగా విద్యార్థి కుటుంబ సభ్యులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

కమ్యూనిటీ హాల్ ప్రారంభం

గాజులరామారం, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): రావినారాయణ రెడ్డినగర్ వెల్ఫేర్ అసోసియేషన్ కమ్యూనిటీ హాల్‌ను కార్పొరేటర్ రావుల శేషగిరి ప్రారంభించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు గోపాల్, ఆలయ కమిటీ చైర్మన్ బీఎంవై నర్సింహ, యాదయ్య, నగేష్, గణపతి, నవాజ్, అంజన్‌గౌడ్ ఉన్నారు.

ఆస్తిపన్ను బకాయిల వడ్డీపై రాయితీ ఇవ్వండి

● సర్కారుకు జీహెచ్ఎంసీ లేఖ

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ఆస్తి పన్ను బకాయిల వడ్డీపై రాయితీ కల్పించాలని కోరుతూ జీహెచ్ఎంసీ ప్రభుత్వానికి లేఖ రాసింది. ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో భారీగా పేరుకుపోయిన బకాయిల వసూలు ద్వారా ఆదాయం పొందవచ్చని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. గ్రేటర్‌లో 18.93 లక్షల ఆస్తిపన్ను చెల్లింపుదారులున్నారు. వీరిలో 30 శాతం మంది ప్రతి యేటా పన్ను చెల్లించడం లేదు. గ్రేటర్‌లో ప్రస్తుతం రూ.8వేల కోట్ల వరకు ఆస్తి పన్ను బకాయిలు ఉన్నాయి. ఇందులో రూ.5 వేల కోట్లు అసలు పన్ను కాగా.. రూ.3 వేల కోట్లు వడ్డీ. వడ్డీపై రాయితీ ప్రకటించిన నేపథ్యంలో అసలులో కొంతయినా వసూలవుతుందని బల్దియా రెవెన్యూ వర్గాలు చెబుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో వడ్డీపై 90 శాతం రాయితీ కల్పిస్తూ రెండు దఫాలుగా వన్ టైం స్కీమ్(ఓటీఎస్) ప్రకటించారు. దీంతో రూ.575 కోట్ల పన్ను వసూలైంది. ప్రస్తుతం అప్పులకు వాయిదాలు, ఉద్యోగులకు వేతనాలు చెల్లించలేని దీనస్థితి ఉన్న నేపథ్యంలో మరోసారి వడ్డీపై రాయితీ కల్పించడం ద్వారా ఆదాయం మెరుగుపర్చుకోవాలని జీహెచ్ఎంసీ భావిస్తోంది. నెల రోజుల్లో ఆర్థిక సంవత్సరం ముగియనున్న నేపథ్యంలో వీలైనంత త్వరగా సర్కారు నిర్ణయం తీసుకుంటే బాగుంటుందని ఓ అధికారి తెలిపారు. ఇదిలా ఉంటే రూ. 5 వేల కోట్ల పన్ను బకాయిల్లో రూ. 3వేల కోట్లకుపైగా ప్రభుత్వ ఆస్తుల నుంచి రావాల్సి ఉంది.

చదవలేకపోతున్నానని ఉరేసుకుని ఆత్మహత్య

పేట్‌బషీరాబాద్, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): సరిగా చదవలేకపోతున్నానని మానసికంగా కుంగిపోయిన పదో తరగతి విద్యార్థి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తమిళనాడు రాష్ట్రానికి చెందిన కాళీముత్తు, దీపకు ఇద్దరు కుమారులు. కాళీముత్తు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. దీప ప్రైవేట్ పరిశ్రమలో కార్మికురాలిగా పనిచేస్తోంది. వీరు చింతల్ పద్మానగర్‌లో నివాసముంటున్నారు. వీరి కుమారుడు వినీత్(16) స్థానికంగా ఉన్న రావూస్ హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్నాడు. పదో తరగతి పరీక్షలు దగ్గర పడుతుండడంతో పాసవుతానో లేదో అన్న బెంగతో కొంతకాలంగా మానసిక వేదనకు గురవుతున్నాడు. సోమవారం విరామ సమయంలో భోజనం చేయడానికి ఇంటికి వచ్చిన వినీత్ ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎంతకూ స్కూల్‌కు రాకపోవడంతో అనుమానం వచ్చిన తోటి విద్యార్థులు ఇంటికి వచ్చి చూడగా ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యచేసుకుని కనిపించాడు. వెంటనే పేట్‌బషీరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీకి తరలించారు.

అనారోగ్యంతో పెట్రోల్ మొబైల్ ఇన్‌చార్జి మృతి

రాయదుర్గం, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): రాయదుర్గం పీఎస్‌లో పెట్రోల్‌మొబైల్ ఇన్‌చార్జీగా పనిచేస్తున్న ఎండీ లాల్ మహ్మద్ విధినిర్వహణలో ఉండగానే అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతు మృతి చెందాడు. రాయదుర్గం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... రాయదుర్గం పీఎస్ పెట్రోల్ మొబైల్ విధి నిర్వహణలో ఉన్న ఎండీ లాల్ మహ్మద్‌కు ఆదివారం సాయంత్రం చాతిలో నొప్పి వస్తుందని చెప్పడంతో పెట్రోల్‌మొబైల్ డ్రైవర్ వెంటనే ఆయనను చికిత్స నిమిత్తం మాదాపూర్‌లోని మెడికేర్ ఆస్పత్రికి తరలించాడు. చికిత్స పొందుతూ సోమవారం మధ్యాహ్నం మృతి చెందాడు. అతని గతంలో లంగ్స్ సమస్య ఉందని పేర్కొన్నారు.

వృద్ధురాలు అదృశ్యం

జీడిమెట్ల, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): మతిస్థిమితం లేని వృద్ధురాలు అదృశ్యమైంది. జగద్గిరిగుట్ట దేవమ్మబస్తీకి చెందిన పబ్బతి లక్ష్మమ్మ (70) ఈనెల 26న ఉదయం 8 గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లింది. ఈమెకు మతిస్థిమితం లేదు. కుటుంబ సభ్యులు అన్ని చోట్లావెతికినా ఆచూకీ లభించకపోవడంతో జగద్గిరిగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

శభాష్ మహేష్



కేపీహెచ్‌బీ తొమ్మిదోఫేజ్‌లో రోడ్డుపై రూ. 48,300 దొరికాయని, ఆ డబ్బులు ఎవరివో గుర్తించి వారికి అందజేయాలని తనిష్క్ జ్యువెలరీలో సేల్స్ మేనేజర్‌గా పనిచేస్తున్న మహేష్ సోమవారం సీఐ వెంకన్నను కలిసి అందజేశారు. శభాష్.. మీ నిజాయతీకి అభినందనలు అంటూ మహేష్‌ను సీఐ మెచ్చుకున్నారు. తగిన ఆధారాలు చూపించి నగదును తీసుకెళ్లవచ్చని సీఐ ఓ ప్రకటనలో కోరారు.

- కేపీహెచ్‌బీకాలనీ, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి)

సర్వే నంబర్ 12లో భూములు అన్యాక్రాంతం

గాజులరామారం, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూమిలో గత మేడ్చల్ జిల్లా కలెక్టర్ ఎంవీ రెడ్డి స్థానిక ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, రెవెన్యూ అధికారులు, స్థానికులతో కలిసి హరితహారం కింద మొక్కలు నాటారు. అధికారులు మొక్కలు నాటి పట్టించుకోక పోవడంతో అవి ఎండిపోయాయి. కోట్ల రూపాయలు విలువ చేసే ఈ భూమిపై కన్నెసిన ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి కోర్టు ఇంటీరియల్ ఆర్డర్ పేరుతో ఆక్రమించుకొని ఏకంగా హోటల్ వ్యాపార సముదాయానికి లీజ్‌కు ఇచ్చారు. మిగిలిన భూమిలో బోర్డులు పాతి, కోర్టు ఆర్డర్ ఉందంటూ కబ్జాకు తెరలేపారు. గాజులరామారం డివిజన్‌లోని ప్రభుత్వ పాఠశాల నుంచి లాల్‌సాబ్ గుడాకు వెళ్లే రోడ్డును ఆనుకొని ఉన్న ప్రభుత్వ సర్వేనెంబరు 12లో సుమారు 2ఎకరాల భూమిలో పాగా వేశారు. సర్వే నంబరు 12లో మొత్తం భూమి 12 ఎకరాల 17 గుంటలు ఉండగా అందులో 5 ఎకరాలు జేఎన్ఎన్ఆర్‌యూఎం ఇళ్ల కోసం కేటాయించగా ప్రభుత్వ పాఠశాల కోసం 5 ఎకరాలు, విద్యార్థుల ఆట స్థలం కోసం మరో 3 ఎకరాలు అధికారులు కేటాయించారు. అందులో నుంచే లాల్‌సాబ్ గూడకు రోడ్డు కూడా ఉంది. ఈ రోడ్డు పోను ప్రైవేట్ సర్వే నంబరు 445ను ఆనుకొని ఇంకా దాదాపు రెండు ఎకరాల భూమి ఉంది. ఈభూమిపై కన్నేసిన కబ్జాదారుడు కోర్టు ఆర్డర్ బోర్డులను పాతి, తమదే అంటూ రెడిమెడ్ కంటెనర్‌ను పెట్టి సెక్యూరిటీని ఏర్పాటు చేశారు. గతంలో కుత్బుల్లాపూర్ మండల రెవెన్యూ అధికారులు ఇక్కడ వెలిసిన బోర్డులను తీసివేసి, ఇది ప్రభుత్వ భూమి అని హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. ఏమైందో, ఏమో కానీ సుమారు వందకోట్ల విలువ చేసే ఈభూమిలో పాగా వేసిన కబ్జాదారుడిపై అధికారులు చర్యలు తీసుకోవడం లేదు.

ఏడీ సర్వే నిర్వహిస్తాం

ప్రభుత్వ భూమి సర్వేనెంబరు 12లో ఏడీ సర్వే నిర్వహిస్తాం. ప్రభుత్వ భూమి ఆక్రమించిందని తెలిస్తే తప్పకుండా, ఆభూమిని స్వాధీనం చేసుకొని ప్రజావసరాలకు ఉపయోగిస్తాం. కబ్జాదారులు ఎంతటి వారైనా, ప్రభుత్వ భూములను కబ్జాచేస్తే వారిపై చర్యలు తీసుకొని కేసులను నమోదు చేస్తాం.

- అబ్దుల్ రెహ్మాన్, కుత్బుల్లాపూర్ మండల తహసీల్దార్